క్లుప్తంగా

దహెగాం ఎస్సైగా విక్రమ్



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై విక్రమ్

దహెగాం: దహెగాం ఎస్సైగా బొల్లం విక్రమ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన కందూరి రాజును ఆసిఫాబాద్ స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. విక్రమ్ ఎస్‌బీ టాస్క్‌ఫోర్స్‌లో ఎస్సైగా పని చేశారు. బదిలీపై దహెగాంకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలను కాపాడడానికి ప్రజలు సహకరించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వాంకిడి: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. శుక్రవారం పోలీసులు ఖమాన ఎక్స్‌రోడ్ వద్ద తనిఖీలు నిర్వహించగా ఆసిఫాబాద్ మండలంలోని భీంపూర్ వాగు నుంచి వాంకిడి మండలం మీదుగా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్‌లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి సామేల గ్రామానికి చెందిన డ్రైవర్లు అలకుంట అనిల్, సొనుర్లే దేవ్‌రావ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రెబ్బెన: మండలంలోని రాంపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఇమ్రాన్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలోని వినియోగదారులు ఇందుకు సహకరించాలని ఏఈ కోరారు.

ఆసిఫాబాద్అర్బన్: మండలంలోని ముల్వాడలోని 11 కేవీఏ లైన్‌లో చేపట్టనున్న మరమ్మతుల పనుల్లో భాగంగా శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బాబాపూర్, అంకుసాపూర్ జీపీ, కాప్పీ జీపీల్లోని గ్రామంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ రూరల్ ఏఈ ఉర్మిల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

తలమడుగు: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి ప్రమోద్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో డీలర్ల సమావేశం నిర్వహించారు. త్వరలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుందని రైతు సోదరులు దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేసేందుకు వస్తారన్నారు. వారికి నాణ్యమైన విత్తనాలు అందించాలని సూచించారు. అదేవిధంగా విత్తనాలు ఎరువులు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా బిల్లులు అందిచాలన్నారు. పంట పొలాల్లో గంజాయి సాగు చేస్తే సంబంధిత రైతుకు ప్రభుత్వ పథకాలు వర్తించవన్నారు. కార్యక్రమంలో ఎస్సై రాధిక, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, వ్యవసాయాధికారులు రమేశ్, డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

ఆదిలాబాద్‌రూరల్: చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంఈవో కంటె నర్సయ్య అన్నారు. మండలంలోని యాపల్‌గూడ ప్రాథమిక, హైస్కూల్‌లో కొనసాగుతున్న ఆర్టిఫిషల్ ఇంటలిజన్స్ (కృత్రిమ మేధా) క్యాంప్, హైస్కూల్‌లో కొనసాగుతున్న ఇండోర్ గేమ్స్ శిబిరాలను శుక్రవారం పరిశీలించారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు ఆయా పాఠశాలలో కొనసాగుతున్న శిబిరాలను సందర్శించామన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రతీ శుక్రవారం టీచర్స్, పేరెంట్స్‌తో సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు సుజాత్ ఖాన్, నారాయణ, ఉదయశ్రీ, శ్రీకాంత్ గౌడ్, ఎస్ఎంసీ చైర్మన్ ఆకాష్, ప్రధానోపాధ్యాయుడు తూరాటి గంగన్న, పేరెంట్స్ పాల్గొన్నారు.

వ్యాపార సముదాయాలు మూసివేయాలి

ఆదిలాబాద్‌టౌన్: రాత్రి పదిన్నర గంటల తరువాత వ్యాపార సముదాయాలు మూసివేయాలని పట్టణ వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పలువురు వ్యాపారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మూడు రోజులుగా పోలీసు సిబ్బంది పట్టణంలో గస్తీ నిర్వహిస్తుండగా ప లువురు వ్యాపారులు తమ దుకాణాలను తెరి చి ఉంచారన్నారు. పాన్‌షాప్, టీ షాప్, కిరాణా షాప్, హోటల్స్ ఉండగా.. పది మందిపై కేసులు నమోదు చేసినట్లుగా పేర్కొన్నారు. యువత ప్రమాదాలను గురి కాకుండా , చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉండేందుకే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

సేంద్రియ సాగుపై ఆసక్తి

- పశువుల ఎరువుపై మొగ్గు చూపుతున్న రైతులు
- పంట పొలాల్లో గొర్రెల మందలు
- భూసారంతో పాటు పెరుగుతున్న దిగుబడి



పొలంలో పశువుల ఎరువు చల్లుతున్న రైతు

ఆసిఫాబాద్‌రూరల్: వ్యవసాయంలో రసాయనిక ఎరువుల వినియోగం పెరగడంతో మట్టిలోని భూసారం దెబ్బతిని తెగుళ్ల ఉధృతి పెరిగి దిగుబడులు రాక అన్నదాతలు అప్పుల్లో కూరుకుపోతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యామ్నాయ ఆలోచనలు చేస్తున్నారు. ఏటా సేంద్రియ ఎరువులపై మొగ్గు చూపే రైతుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మండలంలో రైతులు తమ పంట పొలాల్లోని భూసారాన్ని పెంపొందించే నల్లమట్టి, ఆవు, గొర్రెల పేడ వినియోగించేందుకు ఆసక్తి చూపుతున్నారు. పంటల దిగుబడి కోసం సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి పెడుతున్నారు.

నల్లమట్టిపై ఆసక్తి..

మండలంలో సుమారు 12 వేల మంది రైతులు 54 వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తుంటారు. ఇందులో ఎక్కువగా 36 వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తుండగా మిగిలిన సాగు భూముల్లో వివిధ రకాల పంటలు వేస్తుంటారు. ప్రస్తుతం ఎక్కువ మంది రైతులు సేంద్రియ సాగుపై మొగ్గు చూపుతున్నారు. నల్లమట్టి పంట పొలాలకు ఎంతో మేలు చేస్తుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. దీంతో తమ పంట పొలాల్లో నల్లమట్టి చల్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ మట్టి వల్ల చేలల్లో భూసారం పెరగడంతో పాటు పంట దిగుబడులు రావడంతో మండలంలోని తెలివాడ, బాబాపూర్, ఈదులవాడ, బెల్గాం, బూర్గుడ, మోతుగూడ, రాజుర అప్పపల్లి, ఇటిక్యాల, చిర్రకుంట గ్రామాలకు చెందిన రైతులు పొలాలకు నల్లమట్టి తరలిస్తున్నారు. తమ గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటలోని నల్లమట్టిని తరలిస్తూ తమ పంట పొలాల్లో వేసుకుంటున్నారు. దీంతో దూరాన్ని బట్టి ట్రాక్టర్‌కు రూ.800 నుంచి రూ.1500 వరకు వెచ్చిస్తున్నారు.

పశుపోషణ ఎక్కువ..

తమ పంట పొలాల్లో భూసారాన్ని పెంపొందించుకోవడంతో పాటు ఆ దిశగా దిగుబడి కోసం నల్లమట్టితో పాటు, రైతులు సేంద్రియ ఎరువులపై ఆసక్తి చూపుతున్నారు. మండలంలో ఎక్కువగా గిరిజన గ్రామాలు ఉండటం చాలా గ్రామాలకు పక్కనే ఎక్కువ అటవీ ప్రాంతం కావడంతో ఆవు, గేదె, మేకలు, గొర్రెల పశుపోషణ ఎక్కువగా ఉంది. దీంతో చాలా మంది రైతులు సేంద్రియ ఎరువులను పంట పొలాల్లో వాడుతున్నారు. సేంద్రియ ఎరువులతో పంట దిగుబడి ఎక్కువ వస్తుండటంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఎరువులను కొనుగోలు చేస్తూ పంట పొలాల్లో వేసుకుంటున్నారు. దీంతో పాటు గొర్రెలు, మేకల ఎరువుల కోసం రైతులు చేలల్లో మందలు పెడుతున్నారు. వీటి ఎరువు లారీకి రూ.15వేల నుంచి రూ.20 వేల వరకు ధర పలుకుతుంది. ఆవు, గేదె ఎరువులు రూ.15 వేల నుంచి రూ.16 వేల వరకు డిమాండ్ ఉంది. కాగా శాస్త్రీయ పరిజ్ఞానంతో ఉత్పత్తి చేయబడిన సేంద్రియ ఎరువులను కార్బన్, గోల్డు తదితర పేర్లతో మార్కెట్‌లో ప్రవేశ పెడుతున్నారు.

భూసారం పెరుగుతుంది..



సేంద్రియ ఎరువులు, నల్లమట్టి పొలాల్లో వాడటం వల్ల పంట భూములు సారవంతంగా మారుతాయి. పంటల దిగుబడులు కూడా పెరుగుతాయి. రసాయన ఎరువుల వినియోగం వల్ల క్రమంగా పంటల దిగుబడి తగ్గుతోంది.

– బాపురావు, అప్పపల్లి

బాగా దిగుబడి..



సేంద్రియ ఎరువుల వాడకంతో భూమిలో పోషకాలు పెరుగుతాయి. సూక్ష్మజీవులకు సేంద్రియ పదార్థం ఆహారంగా ఉపయోగపడుతుంది. భూమి సారవంతంతో పంట దిగుబడి పెరుగుతుంది. అన్ని పంటలకు సేంద్రియ ఎరువులను విరివిగా వాడుకోవచ్చు.

– మిళింద్, ఏవో

కొనుగోళ్లు వేగవంతం చేయాలి



దహెగాంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీవో బిక్కు

దహెగాం: యాసంగిలో రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని డీసీవో బిక్కు రాథోడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు లగ్గాం గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. 17శాతానికి మించి తేమ ఉండకుండా చూడాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ధాన్యం ప్రైవేట్‌కు వెళ్లకుండా చూడాలన్నారు. కొనుగోళ్లలో జాప్యం వహించినట్లు, రైతులను ఇబ్బందులు పెట్టినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

వాంకిడి: మండలంలోని బంబార గ్రామ శివా రులో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శుక్రవారం దాడులు నిర్వహించి 8 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7200 నగదు, 6 సెల్ ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మండలంలో పేకాట స్థావరాలపై ప్రత్యేక నిఘా ఉంచామని, ఎవరైనా పేకాట ఆడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

'పాకిస్తాన్, బంగ్లాదేశ్ పౌరులను తరలించాలి'

తలమడుగు: పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల పౌరులను వెంటనే పంపించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ పహల్గాం దాడి వెనక పాకిస్తాన్ హస్తం ఉందని, దీనికి మన ఆదిలాబాద్ జిల్లాలో నివసిస్తున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్ పౌరులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, నక్క ధనుంజయ్, ముత్యాల దేవన్న, దాతజీ కిరణ్, అడెపు శ్రీనివాస్, గోడం భుజంగ్ రావ్, నైతం పాయల్, మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైతువేదికకు వెళ్లేదెలా..?



రైతువేదికకు వెళ్లే దారిలో పిచ్చి మొక్కలు

ఆసిఫాబాద్అర్బన్: మండలంలోని బురుగూడ పంచాయతీ పరిధి గొడవెల్లి రైతువేదికకు వెళ్లే దారి పిచ్చిమొక్కలతో పూర్తిగా మూసుకుపోయింది. రైతువేదిక పరిసరాల్లో పొదలు పెరగడంతో విష సర్పాలు వచ్చే ప్రమాదం కూడా ఉంది. రైతువేదిక పరిసరాల్లో పరిశుభ్రం చేసి నిరుపయోగంగా ఉన్న రైతువేదికను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా ప్రతిష్ఠాపన



హోమం నిర్వహిస్తున్న పండితులు

చింతలమానెపల్లి మండలంలోని రుద్రాపూర్ గ్రామంలో శుక్రవారం గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పోచమ్మ ఆలయంలో పోచమ్మ, శ్రీమహాలక్ష్మి, పోతురాజుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాలలో భాగంగా దేవతామూర్తులకు ప్రాణప్రతిష్ఠ నిర్వహించారు. మంచిర్యాల, మందమర్రి నుంచి వచ్చిన వేదపండితుల ఆధ్వర్యంలో హోమ, యాగాదులను నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులకు మహాప్రసాద వితరణ నిర్వహించారు. ఆదివారం గ్రామంలో బోనాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

– చింతలమానెపల్లి



పోతురాజు విగ్రహం



శ్రీమహాలక్ష్మీ విగ్రహం



పూజలు నిర్వహిస్తున్న పండితులు



పూర్ణకుంభంతో పూజా కార్యక్రమం..



పోచమ్మ తల్లి విగ్రహం

అమ్మవారిని దర్శించుకున్న జీఎం



అమ్మవారిని దర్శించుకుంటున్న జీఎం విజయ భాస్కర్‌రెడ్డి దంపతులు



అంబలి పంపిణీ చేస్తున్న జీఎం విజయ భాస్కర్‌రెడ్డి

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల ప్రసిద్ధ కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయాన్ని శుక్రవారం బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి సతీసమేతంగా సందర్శించారు. ఈసందర్భంగా అమ్మవారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, నైవేద్యాలు సమర్పించి కుంకుమ పూజలు చేశారు. ఆలయ చరిత్ర అడిగి తెలుసుకున్నారు. అమ్మవారు కొలువైన తీరును ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ జీఎం దంపతులకు వివరించారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను జీఎం దంపతులకు అందజేశారు.

అంబలి పంపిణీ..

వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని దేవార వినోద్‌స్వామి ఆలయంలో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న అంబలి పంపిణీ కార్యక్రమాన్ని జీఎం పరిశీలించారు. దేవార వినోద్ స్వామి చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలపై తెలుసుకున్న ఆయన అభినందించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అంబలి కోసం వచ్చిన ప్రజలకు జీఎం అంబలిని పంపిణీ చేశారు.

'తలరాతలు మార్చేది చదువు'



అక్షరాలు దిద్దిస్తున్న రమేశ్

ఆసిఫాబాద్‌రూరల్: అక్షర చైతన్యయాత్రలో భాగంగా శుక్రవారం మండలంలోని పాడిబండ గ్రామంలో నిరక్షర్యాసులకు చదువుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ప్రభుత్వ ఉపాధ్యాయుడు రమేశ్ మాట్లాడుతూ తలరాతలు మార్చేది చదువేనన్నారు. చైతన్య దీప్తి అజ్ఞానాంధకారంలో ఉన్న ప్రజలను విజ్ఞానవంతులుగా చేయాలని తలంపుతో గిరిజన గ్రామాల్లో ప్రజలను సమీకరించి అక్షరాలు నేర్పిస్తున్నట్లు తెలిపారు. తన సొంత ఖర్చులతో వేసవి సెలవుల్లో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ చందు, కార్యదర్శి ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు కొనుగోలు చేయొద్దు



మాట్లాడుతున్న సీఐ రవీందర్

ఆసిఫాబాద్‌రూరల్: రైతులు నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని సీఐ రవీందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని గోవింద్‌పూర్ గ్రామంలో కళాబృందాల ద్వారా గ్రామస్తులకు సైబర్ క్రైం, రోడ్డు భద్రత, నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు సమయంలో అప్రమత్తంగా ఉండి లైసెన్స్ పొందిన దుకాణాలు వ్యాపారుల నుంచి విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని, సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై అంజయ్య, కళాబృందం సభ్యులు రాంచందర్, రోహిత్, శ్రీనివాస్, చంద్రశేఖర్, రజిత తదితరులు పాల్గొన్నారు.

యువ వికాసం ధ్రువపత్రాల పరిశీలన పూర్తి



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

కౌటాల: రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శుక్రవారం ముగిసిందని ఎంపీడీవో రమేశ్ తెలిపారు. చివరి రోజు కౌటాల ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు ధ్రువపత్రాలను పరిశీలించారు. షెడ్యూల్ ప్రకారం మండలంలోని బోదంపల్లి, గుడ్లబోరి, కౌటాల, గుడ్లబోరి గ్రామ పంచాయతీల్లోని అభ్యర్థుల పత్రాలను ఎంపీడీవో రమేశ్, ఏపీవో ముక్తేశ్వర్, టీజీబీ బ్యాంకు మేనేజర్ రమేశ్ పరిశీలించారు. మండల వ్యాప్తంగా 2033 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోగా.. 1502 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించినట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సు



దర్గా ప్రాంగణంలో భక్తులు



ఖవ్వాలి పాడుతున్న గాయకులు

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని డొనల్ ప్రాంతంలో గల సయ్యద్ తాలిబ్ అలీషా బాబా దర్గా ప్రాంగణంలో గురువారం రాత్రి నుంచి ఉర్సు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉర్సు ఉత్సవాల్లో భాగంగా ఉర్సు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఉర్సు ఉత్సవాలు ప్రారంభించారు. భక్తులు కాగజ్‌నగర్ పట్టణం నుంచి కాలినడకన సిర్పూర్(టి)లోని దర్గా వరకు చేరుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక బస్టాండ్ ప్రాంతం నుంచి డొనల్ ప్రాంతంలోని దర్గా వరకు సందల్ ఊరేగింపు కార్యక్రమం బ్యాండు మేళాలతో, గుర్రాల నృత్యాలతో సందల్‌ను ఊరేగింపుగా దర్గా ప్రాంగణంలోకి తీసుకెళ్లి బాబా సమాధికి చాదర్ సమర్పించారు. శుక్రవారం రెండో రోజు సైతం సిర్పూర్(టి) భక్తులు స్థానిక పెట్రోల్ పంపు నుంచి డొనల్ దర్గా వరకు సందల్ ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు దర్గా ప్రాంగణంలో ప్రముఖ గాయకులతో ఖవ్వాలీ కార్యక్రమం నిర్వహించగా భక్తులు రాత్రంత ఖవ్వాలీ కార్యక్రమాన్ని వీక్షించారు. సీఐ రమేశ్, ఎస్సై కమలాకర్‌ల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై విజయ్

కౌటాల: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కౌటాల ఎస్సై గుంపుల విజయ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో స్థానిక యువకులకు ఆయన వాలీబాల్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడుతూ, ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. యువత నిత్యజీవితంలో క్రీడలను భాగంగా చేసుకోవాలన్నారు. యువత బెట్టింగ్‌కు దూరంగా ఉండాలని, చట్టవ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొంటే బంగారు భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

గోండు జాతి అభివృద్ధికి కృషి చేద్దాం

బేల: గోండు జాతి అభివృద్ధికి, పరిరక్షణకు కృషి చేద్దామని రాజ్‌గోండ్ సేవా సమితి మండల అధ్యక్షుడు నాగోరావు శుక్రవారం అన్నారు. మండల కేంద్రంలో రాజ్‌గోండ్ సేవా సమితి ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు.